# దివ్యదృష్టి

★ 'చక్రపాణి' ★

ప్రౌఢకవి కళ్లు మూసి ధ్యానంలో పడ్డాడు!-ఊహుం-ధ్యానంలోపడి కళ్లు మూశాడు! ఊహుఁ-రెండూ నిజంకాదు: కవి కళ్లు మూసి ఆలోచనలో పడ్డాడు! ఆఁ, ఇదే కొంత వరకు నిజం.

కవంటే మామూలు కవి కాదాయన-ఆ జన్మకవి! బొడ్డూడి నప్పటినించీ కవిత్వం చెప్పేవాడంటే అతిశయోక్తి కావచ్చుగాని, గోచీపెట్టినప్పటినించీ కవిత్వం చెప్పేవాడంటే ఎవ్వరూ ఆశ్చర్యపడ నక్కర్లేదు. యదార్థం కూడా అంతే!-ఇరుగుపొరుగమ్మలు మొదటి సారి ముద్దుకు గోచీపెట్టితే, ముద్దుగా మొదటి పద్యం అల్లాడు :-

మీదు యువివేకమునకునే లెస్సగుంది
నాడనని చెప్పుటకు సిగ్గు కరముపడితి,
ఎందులకు బంధనము దెప్పు డతివలార!
దేవుడిచ్చిన యంగంబు దాచనేల?

పెయ్యివోన్న బాంబు తమముందు పడ్డా గాని అమ్మలక్కలంత దిగ్భ్రమచెంది ఉండరు. తమకు తెలియకుండానే వాళ్ల వ్రేళ్లు ముక్కుల మీదికి పోయినై!

తండ్రికి సంగతి తెలిసింది. ఆయన కొడుకు కృతిత్వానికి సంతసించక పోలేదు గాని, పద్యార్థంమీదికి దృష్టి పోవటంచేత దీర్ఘాలోచనలో పడ్డాడు. పడి, తన పుత్రుడు గొప్ప వేదాంతికాగలడనీ, ఐతే, అందుకు తగిన వాతావరణను కల్పించవలసి ఉంటుందనీ నిశ్చయించి, బాలకవిని మఠాధిపతికి వప్పగించాడు.

కవి తల్లికి-కొడుకును వదలటం ఇష్టం లేదు- ఐనా భర్తనోటికి వెరచి ఊరుకుంది.

సరే, ఆ రోజున ఈ బాలకుడిలో పడ్డ కవితాబీజం అంకురించింది, పుష్పించింది, ఫలించింది. ఇంకోవిధంగా చెప్పాలంటే మొక్కయింది, మానయింది, వేళ్లుదిగాయి, ఊడలు జారాయి!-ఈ రోజున ఆ చెట్టు నాశ్రయించుకుని ఎన్నో పక్షులు బతుకుతున్నాయి. ఎన్నో కొక్కెరలు కొక్కెరిస్తున్నాయి.

సరే, ఇక అసలువిషయానికొద్దాము.

ఇక బాలకవి-అంతవరకతను ఒక్క-తెలుగు పొత్తంకానీ, సంస్కృత పుస్తకంగానీ ముట్టి ఎరగడు. ఐతే ఏం?-నిషాదుణ్ణి తిట్టిన తిట్టు శ్లోకమైనందుకు మొదట వాల్మీకి ఎంత ఆశ్చర్యపడ్డాడో, తర్వాత ఎంత తన్మయత్వం చెందాడో సరిగ్గా, తూచినట్టు అంత ఆనందమూ, తన్మయతా మన బాలకవికూడా

పొందాడు! ఎందుకు పొందడూ? మానవ హృదయాలు-ఉహలు-కవి హృదయాలు సమానంకావూ? మనస్తత్వం అనేది లేదూ?

కవి కళ్లుమూసి ఆలోచలోపడ్డాడని చెప్పానుకదూ! ఆ-ఆలోచలోపడి తన జీవితా-



గోచీ పెట్టినప్పటినించీ కవిత్వం చెప్పేవాడు.

న్నొకమాటు సింహావలోకనం చేసుకున్నాడు. అతను మఠంలోనించి తప్పించుకుని మామూలు స్ంసారికావటాని కెన్ని తిప్పలుపడ్డాడు. సంసారిఅయినాక అతనిమీదుగా ఎన్ని తుపాన్లు వీచినై! చెట్టంత అల్లుడు పిల్లనరాలిపోలేదా? సంసారసుఖం ఎరగనికూతురు శాశ్వతంగా తన మెడకిచుట్టుకోలేదా? ఐతేఏం? తను చలించాడా? తర్వాత కొన్నాళ్లకి ప్రేయసి తనతో చేసిన ప్రతిజ్ఞలన్నీ విస్మరించి తనకంటే ముందు పోయి కూర్చోలేదా? అది-అతన్ని కొంత చలింపజేసిందికూడా. ఐనా అతనునిగ్రహించుకుని, ఒక డజను విషాదగీతికలుగీకి ప్రకటించి, పునర్వివాహంచేసుకున్నాడు.

ఆ. ఈ వివాహంగానీ కూతురు వైధవ్యంగాని అతని మనస్సుకు కష్టకారణాలు

కాలేదు. పైగా కొంతకాల మతని కవిత్వంలో కరుణ శృంగారరసాలు ప్రాధాన్యతవహించాయి. అదీకాక, ఈ భార్య, అడుగుపెట్టిన వేళ ఎటువంటిదో కవికి సన్మానాలు మిక్కుటమైనై. అతని కవితాప్రకాశం రాష్ట్రీయతనే సంకీర్ణసీమనుదాటి ఖండాంతరాలకి వ్యాపించింది. అతనిమీద పద్యాలురాసే కొంతమంది కవులైనారు. అంటే కవితావస్తువు దొరకనిపిల్ల కవులంతా వీరి “పుస్తకాన్నో, ఏ పాత్రనో, ఏ శబ్దాన్నో తీసుకుని పంచరత్నాలూ, నవరత్నాలూ రాసి పారవేశేవారు. ఇప్పుడు కవిగారి అమూల్య ఉపదేశాలు పొందటానికై ఇంటికివచ్చేవారి సంఖ్య అధికమైంది. తలవనితలంపుగా దూరదూరాన్నించి సభలకధ్యక్షతవహించమనీ, ఉపన్యాసాలివ్వమనీ ఆహ్వానాలొస్తూ ఉండేవి. వీలున్నంతవరకు ఆయనకాదని ఎరగడు-తేదీలు మార్పించేవారుకాని! ఇప్పుడు సాహిత్యరాజ్యానికి మనకవి రాజు, ఇటలీరాజులాంటిరాజుకాదు మన దేశరాజులాంటిరాజు. ప్రతి గ్రామంలోనూ వీరి శిష్యులు-విరి రచనల కర్థంచెప్పుతూ ప్రచారంచేస్తూఉంటారు, ఐనా, దీపంక్రింద క్రీనీడ ఉండనేఉంటుంది. ఈ మధ్య సాహిత్యయాచకులు కొంతమంది వీరి రచనల్లో సారంలేదనీ సైకాలజీలేదనీ ఒక రకంప్రచారం లేవదీశారు. అందులో ఒకాయన కవికి ఎకనామిక్స్ తెలియువని బాహాటంగాఅన్నాడు. కవికి సైన్సూ, ఎకనమిక్సూ, జుయాలజీ, బయాలజీ కంప్లసరీగా తెలిసిఉండాలన్నట్టు! వీటిమీద మనకవి అథారిటేటివ్ గా గ్రంథం ఈయబోతున్నాడా ?-సందర్భానన్నుసరించి తనకూ తెలుసునన్నట్టుకూస్తున్నాడుగాని.

ఏమైనాగానీ కవిలో ఇప్పుడు మార్పు రావాలి. లేకపోతే ఈ కుర్ర కారుతో వెనక పడిపోతాడు. కాని, వాళ్లదృష్టీ వీరిదృష్టీ ఒకటి ఎలాఅవుతుందీ? దీనికొకటే క్రియఉంది. దివ్యదృష్టి! అది లభిస్తే? ఇతర్ల మానసవల్మీకాల్లో నించి భావాలనే సర్పాలని బయటికిలాగవచ్చు. కాని, తనకు సాధ్యమవుతుందా, అది? పూర్వం మహర్షులకుమాత్రంఉండేది! -ఒకవేళ అయితే తనకే కావాలి-ఈ మధ్య తన్ను పూర్వప్రముఖులతోపోలుస్తూ ఆషాఢభూతి ఒక వ్యాసం కూడారాశాడు!

మన కవికి గురువు అప్పయ్యదీక్షితుల వారే. కావ్యాంతాన ‘సరస్వతీ వరప్రసాదలబ్ధ అని చెప్పుకున్నా వీరి కవితాశక్తి పూర్వజన్మ సంచితమేగాని ఇప్పటిదికాదు. ఇంతకాలంనించి అనవసరంగా సరస్వతీదేవికి పబ్లిసిటీ ఇస్తూ వచ్చాడు-ఒక్క మేలుకూడా ఆమెవల్ల ఇతనికి చేకూరలేదు. ఈ రోజున తను దివ్యదృష్టికావాలని కోరితే సరస్వతి తిరస్కరిస్తుందా? చూద్దాం అదీ, ప్రయత్నించి!

నన్నయనించి తనవరకుగల సరస్వతీ స్తోత్రాలన్నీ వల్లించాడు. అందులో పోతన్నవి మాత్రం రెట్టించాడు. గొంతెండి నిద్రపోయాడు కవి.

దేవి సాక్షాత్కరించింది – కాటుకకంటి నీరు చనుకట్టుపయి పడుతూకాదు, ప్రసన్నవదనంతో !

"తల్లీ ! ఈ యధమునిపై దయగలిగినదా ! కృతార్థుడను." అన్నాడు కవి.

"వత్స ! ఎందులకింత కాతరుడవై యున్నావు ?" అన్నది దేవి జాలితో.

"మాత ! నీకు దెలియని రహస్యమేమి గలదు. ముజ్జగములలో !నాకు దివ్యదృష్టి నొసగుము." అని కళ్ళుతుడుకున్నాడు కవి, పిల్లవాడివలె.

దేవి ఆశ్చర్యముతో – "దివ్యదృష్టి !" "అని మళ్లీ నవ్వుతూ" కవులు దివ్యదృష్టి సహించలేరు. వారిమనం బతికోమలము." అన్నది.

"తల్లీ ! నన్ను బరీక్షించుచుంటివా ! నేను తక్కిన కవులతో సమానుడనా ?"

"వత్స ! నీ మనస్సు నొప్పించుట నాకయిష్టము. ఒక దివసము, అన నెనిమిది యామములు నీకు దివ్యదృష్టి బ్రసాదించితిని. ప్రయత్నించిచూడుము. నీ కిష్టమగు నెడల తిరిగి శాశ్వతముగ నొసగెదను."

"మహా ప్రసాదము, మాతరో!" అన్నాడుకవి.

కవి కళ్ళు నులుముకుంటూ లేచాడు. కాలకృత్యాలు తీర్చుకున్నాడు. చిత్రం !–నిద్ర నించి లేచేవరకు ప్రపంచమంతా తల్లక్రిందులైంది. మనుష్యులందరిలో మార్పు. నోరు మెదపకపోయినా వారు మాట్లాడేమాటలు వినబడుతున్నాయి.

కవి పత్నిపూజా సామగ్రి సిద్ధంచేసింది– కవి దేవతార్చనకు కూర్చున్నాడు. "చాదస్తం" అని నవ్వుకుంటూ బావిదగ్గరికి బయలుదేరింది కవిపత్ని.

కవికి ఆశ్చర్యంవేసింది. "ఏమన్నావూ?" అని కేకవేశాడు.

"ఏమన్నా" నంటూ తిరిగి నుంచుంది కవిపత్ని. కవికి దివ్యదృష్టిసంగతి జ్ఞాపకం వచ్చింది. "ఏమీలేదు" పొమ్మన్నాడు.

కవి దేవతార్చన ముగించుకుని సరస్వతీసేవకు పూనుకున్నాడు. దేవికూడా వారిని పూనింది. నిన్న పొగమంచులాగా ఉన్న భావాలెన్నో నేడు వారికి పరిష్కరించినట్టు స్పష్టంగా కన్పిస్తున్నాయి. పరపర కాయితాలమీద కాయితాలు రాసివేస్తున్నాడు

శిష్యుడొచ్చి కూర్చున్నాడు, ఆపాథభూతి ! కవి తలఎత్తకుండానే గ్రహించి కొన్ని కాయితాలు అతగాడిపైపుకు తోశాడు.

"ఎందుకీ చెత్త!" అనుకున్నాడు ఆపాథభూతి వొళ పేజీచదివి.

"చెత్తా ?" అని హుంకరించాడు కవి. ఎందుకు హుంకరించడూ ? తను రాసిన కవిత్వం

మీద శిష్యుడెప్పుడూ ఇలాంటి రిమార్కు పాసుచెయ్యలేదు. పైగా, తనురాసిన పద్యాలమీదా, శబ్దాలమీదా, ఆఖరికి అరసున్నలమీదకూడా అనుకూలంగా విమర్శనలు రాశాడు. ఇంకా, 'నిగ్రహం' అనే శీర్షికతో వీరి ఇంద్రియ నిగ్రహంమీదా, మనో నిగ్రహం మీదా, ఇంకా దేవుడు మేలుచేస్తే రచనా నిగ్రహంమీద వ్యాసాలు రాశాడు! ఇప్పుడో?

శిష్యుడుగాభరాతిన్నాడు. తాననుకున్న మాట పైకి వినపడిందేమోనని సందేహించాడు. ఐనా గత్యంతరంలేక- "చెత్తేమిటండీ, గురువుగారూ ?" అని ప్రశ్నించాడు.

గురువుగారికి గుర్తువచ్చింది, రాత్రిసంగతి. "ఏమీలే"దని మళ్లీ కవితారచనలో మగ్నుడైపోయాడు.

ఆషాఢభూతి కవితాపరన వదిలాడు. మామూలు కార్యక్రమంలో పడ్డాడు, గురువుగారింట్లో ఆడవాళ్ళు కనపడతారేమోనని చాతక పక్షిలాగ- చూడటం !

శిష్యుడి ప్రవర్తన చూసేవరకు గురువుగారికలం ముందుకు సాగలేదు. వచ్చే భావాలన్నిటికీ శిష్యుడే ఆధారమయ్యాడు. ఇంతలో గురువుగారి కూతురు ఏదో పనిమీద తండ్రిదగ్గరకొచ్చి, ఆషాఢభూతిని చూసి నవ్వుకుంటూ తిరిగి వెళ్ళింది.

గురువుగారిమీద గొంగళిపురుగు పాకినట్లయింది. ధుమధుమలాడుతూ సరస్వతికిస్వస్తి చెప్పి లేచాడు. గురువుగారి వింత ప్రవర్తన ప్రియశిష్యుడికర్థంకాక, మనస్సులో తీవ్రంగా విమర్శించుకుంటూ చల్లగా ఇంటికి జారుకున్నాడు.

భోజనానికి కూర్చుంటే కవిపత్ని మామూలుకన్న ఎక్కువ శ్రద్ధాభక్తులతో భర్తకి భోజనపదార్థాలు వడ్డించింది. భర్త సంతోషంగా ఉండగా కొత్తచీర తెచ్చిపెట్టమని అడగాలని ఆమెకోరిక. కవి ఈ సంగతి గ్రహించి వంటకాలు బాగుండలేదని విసుక్కున్నాడు. కవిపత్ని ఇక ఆ ప్రస్తావన తేలేదు. ఆమె శ్రమంతా వృథా అయింది.

భోంచేసి శ్రీమంతుడి దగ్గరికి బయలుదేరాడు కవి. దోవలో వీరిమిత్రులిద్దరు దూరానఉన్న కవిని చూసి ఇలా అనుకుంటున్నారు —

ఒకడు-వస్తున్నాడోయ్, మహాకవి.

రెండో-ఇక బోర్ చెయ్యంది వదిలిపెట్టడు.

ఒకడు-మహాచావుగా ఉంది రా ఇతనితో! బాగాలేదంటే చంపేస్తాడు; బాగాఉందంటే జీడిలాగా పట్టుకుంటాడు, ఆపూటల్లా!

రెండో-ఏంచేస్తాం! ఈతిబాధల్లో దీన్ని కూడా కలుపుదాం.

ఇంతలో కవిదగ్గరకొచ్చాడు. రెండోవాడు ప్లేటుమార్చిఅన్నాడు -"గురువుగారూ

మొన్న మీరిచ్చిన ఉపన్యాసం పత్రికల్లో చదివామండీ చాలా గొప్పగా ఉంది. కాని ఆ ఆదర్శాలున్నాయే మాబోటి మామూలు-''

మామూలురోజుల్లోఅయితే ఈమాత్రం స్తోత్రందారికితేచాలు కవికి పురాణాలూ, ఉపనిషత్తులూ క్రోడీకరించి ఆ ఎర్రటి ఎండలో రెండు గంటలు ఉపన్యాసందంచేవాడు. కాని ఇవ్వాళ్ళ కవికి నోరులేవలేదు. జాలిగా వాళ్ళవంకచూసి "ఏనుంది, రేపు కనపడతా"నని వెళ్ళిపోయాడు ఆయనపోతేమాత్రం వదులుతారా ఈ మహానుభావులు? వెనకాల వెక్కిరిస్తూ విమర్శనలు సాగించారు, కవికి తెలియదనుకుని.

శ్రీమంతుని యింటికిచేరుకుని కవి ఎండలోవచ్చిన శ్రమంతా మర్చిపోయాడు హాయిగా పంకాకిందకూర్చుని. తను వచ్చినట్టు నౌకరు ద్వారా కబురుచేశాడు పైకి. ఇక్కడైనా మనశ్శాంతి దొరుకుతుందని ఆశ, నౌకరుకాసేపట్లో తిరిగొచ్చి 'అయ్యగారు నిద్రపోతున్నా'రని చెప్పాడు.

కవి మనస్సు విరిగిపోయింది. "నిద్రపోతున్నారా! శాస్త్రితో చదరంగమాడటం లేదూ?" అన్నాడు నోరుజారి. నౌకరేంచేస్తాడు? బిత్తరపోయి-"నేను చూడలేదు బాబయ్యా అమ్మగారు చెప్పారు" అన్నాడు

"అమ్మగారట! అనవసరంగా ఆమె నెందుకిందులోకి ఈడ్వడం?" అనుకుని కవి ఇంటి ముఖంపట్టారు.

దోవలో కవిగారి భక్తుడొకాయన కనపడ్డాడు. ఈ భక్తుడు మహాపట్టుదలగలవాడు. కవిగారు కనపడితేచాలు, ఆయనచేత బలవంతానైనాసరే కాఫీ తాగించిగాని వదలడు. ఇవ్వాళకూడా అతను అదే ఫక్కీగా మాట్లాడాడు. కాని, ఆ బలవంతంలో యదార్థంగా పటుత్వమెంతుందో కవి ఈ నాడు గ్రహించాడు. ఇంతకాలానికి అతనిమాట తోసి పుచ్చగలిగాడు!

★

సాయంత్రం కవి మామూలు పురాణ పఠనచేస్తున్నాడు. కుమార్తే, ఇంకా ఇరుగు పొరుగమ్మలూ వింటున్నారు. పరిత శ్రోతలూ రసావేశంలోఉన్నారు.

ఆషాఢభూతితన్మయుడై జావళీపాడిన ఆనందం అనుభవిస్తూ వీరింటికివచ్చారు. కవిగారు మనస్సు వాడి వైపుకులాగింది-వాడి మనస్సును ఒక్క క్షణంలో చదివాడు. ఝుంయ్‌న పాదుక విశిరాడు

ఆషాఢభూతిని ముసలమ్మలంతా చుట్టుముట్టారు. కవి పత్నివాడికికేకవిని లోపలినించి వచ్చింది. మంచినీళ్ళిచ్చి వాడిని వోదార్చి పంపింది

కవి అంతాచూస్తూ ఊరుకున్నాడు-అందరూ తన్ను దూషిస్తున్నారనికూడా తెలుసుకున్నాడు. అందరితోపాటు తనభార్య, కూతురుకూడా-కవి ఇక వినలేక "దేవీ" అని పిచ్చికేకవేసి మూర్ఛపోయాడు. ఎంతో శుశ్రూష చేసినమీదట రాత్రి పన్నెండుగంటలకి వారికి మళ్లీ స్మృతివచ్చింది

ఈ మాటు కవి ఇంకో కొత్తవరంకోరాడు-"నిన్న జరిగిన విషయాలన్నీ మర్చిపోయేటట్టు చెయ్యమని"

దేవి అనుగ్రహించింది.